





● జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయాలు





● ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు



స్వచ్ఛతలో.. వెనకబాటు

- జిల్లాలోని రెండు మునిసిపాలిటీల్లో దయనీయ పరిస్థితులు
- కొంతమెరుగు పడ్డ ఖానాపూర్ పట్టణ పరిస్థితి
- అయినా.. దక్కని స్వచ్ఛ భారత్ మిషన్ అవార్డులు
- బల్దియాల్లో తీవ్రమవుతున్న పారిశుధ్య సమస్య
- చెత్త సేకరణలోనూ నిర్లక్ష్యం
- కంపు కొడుతున్న పట్టణాలు
- సరైన పర్యవేక్షణ లేకపోవడమే వైఫల్యాలకు అసలు కారణం

నిర్మల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రతియేటా కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల్లో జిల్లాలోని మూడు మునిసిపాలిటీలు వెనకబడ్డాయి. ముఖ్యంగా పారిశుధ్య పనుల్లో ఈ మూడు మునిసిపాలిటీలు నిర్లక్ష్య ధోరణి అవలంభించడమే కాకుండా పరిశుభ్రత విషయంలో వెనకబడ్డ కారణంగా స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు మునిసిపాలిటీలు దూరమయ్యాయి. నిర్మల్, భైంసా మునిసిపాలిటీల్లో పారిశుధ్య సమస్య దయనీయంగా మారగా.. ఖానాపూర్ మునిసిపాలిటీలో కొంత మేరకు ఆశించిన ప్రగతి నెలకొంది. దీంతో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల్లో నిర్మల్, భైంసా మున్సిపాలిటీల కన్నా ఖానాపూర్ మునిసిపాలిటీ కొంతమేరకు ముందు వరుసలో నిలిచింది. మునిసిపాలిటీల్లో ఇంటింటా చెత్త సేకరణతో పాటు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం, పబ్లిక్ టాయిలెట్స్ వినియోగం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మురికి కాలువలు, వీధులు శుభ్రం చేయడంలో సంబంధిత మునిసిపాలిటీలు అలక్ష ధోరణి అవలంభిస్తున్నాయని ఈ సర్వేక్షన్ ర్యాంకులు తేటతెల్లం చేస్తున్నాయి. నిర్మల్, భైంసా మున్సిసిపాలిటీల్లో పారిశుధ్యం విషయంలో అడుగడుగునా అలక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలున్నాయి. ప్రతియేటా అందించే స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల్లో ఈసారి నిర్మల్ మునిసిపాలిటీకి జాతీయ స్థాయిలో 152 స్థానం, రాష్ట్ర స్థాయిలో 53వ స్థానం దక్కింది. అలాగే భైంసా మునిసిపాలిటీకి జాతీయ స్థాయిలో 483, రాష్ట్రస్థాయిలో 70 ర్యాంకు దక్కింది. కాగా ఖానాపూర్ మునిసిపాలిటీకి ఈసారి జాతీయ స్థాయిలో 173వ స్థానం, రాష్ట్రస్థాయిలో 45వ స్థానం దక్కింది. రెండు మునిసిపాలిటీల కన్నా ఖానాపూర్ మునిసిపాలిటీ కొంత మేరకు ప్రగతి సాధించడం గమనార్హం. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ విషయంలో మునిసిపాలిటీల వెనకబాటుకు సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమేనంటున్నారు. సిబ్బంది, నిధుల కొరత కారణంగానే పారిశుధ్య పనుల నిర్వహణను సక్రమంగా చేపట్టలేకపోతున్నామని అధికారులు వివరిస్తున్నప్పటికీ.. సరియైన పర్యవేక్షణ లేకపోవడం వైఫల్యాలకు కారణమవుతోందని అంటున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న జనాభా

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీల్లో రోజు రోజుకు జనాభా పెరుగుతుండడమే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ నివసించేందుకు వస్తున్న వారి సంఖ్య రెండింతలవుతోంది. దీనికి తోడుగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలకు శివారు ప్రాంతాలు కూడా తోడవుతుండడం, కొత్త కాలనీలు ఏర్పడుతుండడంతో పారిశుధ్యం సమస్య కీలక అంశంగా మారుతోంది. అయితే మునిసిపాలిటీల్లో అధికారులు ఇతర వ్యవహారాలపై ఎక్కువ దృష్టి సారిస్తూ పారిశుధ్య విషయంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుండడం స్థానిక ప్రజలకు సమస్యగా మారుతోందని అంటున్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణను సక్రమంగా చేపట్టకపోతుండడమే కాకుండా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విషయంలోనూ నిర్లక్ష్య ధోరణి వెల్లడవుతోందని అంటున్నారు. నెలల తరబడి మురికి కాలువలను శుభ్రం చేయకపోతుండడం, రోడ్లను సక్రమంగా ఊడ్చకపోతుండడంతో ప్రజలు దుర్వాసనలతోనే సహవాసం చేయాల్సి వస్తోంది.

పర్యవేక్షణ లోపమే సమస్యకు కారణం

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీల్లో పారిశుధ్యం వ్యవహారాన్ని పరిశీలించాల్సిన అధికారులు పూర్తి నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీని కారణంగానే సిబ్బంది పారిశుధ్యం పనుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. నిర్మల్ మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య కోసం వార్డుల వారిగా ఇన్‌చార్జ్(జవాను)లను నియమించారు. వీరూ ప్రతిరోజూ తమకు కేటాయించిన వార్డుల్లోని పారిశుధ్య సమస్యను పరిశీలిస్తూ సిబ్బంది చేత పనులు చేయించాల్సి ఉంటోంది. అయితే ఈ జవానులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పారిశుధ్య పనుల విషయంలో పర్యవేక్షణ చేయకపోతుండడం అలాగే అలక్ష్యంగా వ్యవహరిస్తుండడం పట్టణ ప్రజలకు శాపంగా మారింది. కలెక్టర్ నివసించే జిల్లా కేంద్రంలోనే పారిశుధ్య పరిస్థితి ఎంతో దయనీయంగా ఉన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారంటున్నారు.

సిబ్బంది, నిధుల పేరిట అలక్ష్యం

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిసిపాలిటీల్లో చెత్త సేకరణ ప్రక్రియ ఆశించిన మేరకు కొనసాగడం లేదన్న ఫిర్యాదులున్నాయి. మునిసిపల్ సిబ్బంది ఆటోల్లోనూ, ఇతర వాహనాల్లోనూ ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉన్నప్పటికీ.. మూడు నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే చెత్త సేకరణ జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీని కారణంగా ప్రజలు ఖాళీ స్థలాల్లోనూ, రోడ్లపైనే చెత్తను విసిరేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని అనేక కాలనీల్లో ఇలాంటి చెత్త కారణంగా మినీ డంపింగ్ యార్డులు ఏర్పడుతున్నాయి. ఈ డంపింగ్ యార్డుల కారణంగా వీధులన్నీ దుర్గంధంతో కంపుకొడుతుండడం జనాలను ఇబ్బందులకు గురి చేస్తోంది. అయితే పారిశుధ్యం విషయంలో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా.. స్పందన అంతంత మాత్రంగానే ఉందని అంటున్నారు. వాహనాలు, నిధులు, సిబ్బంది కొరత కారణంగానే చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించడం లేదంటూ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పారిశుధ్య పరిరక్షణకు రాష్ట్ర నిధులే కాకుండా కేంద్ర నిధులు సైతం పెద్దమొత్తంలో మంజూరవుతున్నప్పటికీ అధికారుల చిత్తశుద్ధి లోపంతో రోజురోజుకూ పారిశుధ్య సమస్య తీవ్రరూపం దాల్చుతోందని అంటున్నారు.



మరింత మెరుగ్గా పని చేస్తాం..

: సుందర్ సింగ్, మునిసిపల్ కమిషనర్, ఖానాపూర్



స్వచ్ఛ సర్వేక్షన్ 2025లో ఖానాపూర్ మునిసిపాలిటీకి మెరుగైన ర్యాంక్ వచ్చింది. రాష్ట్రస్థాయిలో 45వ ర్యాంక్, జాతీయ స్థాయిలో 470 సాధించాం. రానున్న రోజుల్లో మరింత మెరుగైన పనితీరును కనబరిచి మరింత ఉన్నత స్థానానికి వచ్చేందుకు కృషి చేస్తాం.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే

తానూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ అన్నారు. శనివారం తానూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉండాల్సిన డాక్టర్లు విధులకు హాజరుకాక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో ఆఫీసర్‌కు ఫోన్ చేసి డ్యూటీకి హాజరు కాని డాక్టర్లకు హెచ్చరికలు జారీ చేయాలని, క్యాంపు కార్యాలయానికి వచ్చి తనను కలవాలని ఆదేశించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించి పేద రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదన్నారు. తొమ్మిది గంటల సమయంలో వార్డులు శుభ్రం చేస్తున్న సిబ్బందిని నిలదీశారు. ఆసుపత్రిలో ఓపి ప్రారంభమైన తర్వాత ఆసుపత్రిని శుభ్రం చేస్తారా అని శానిటేషన్ సిబ్బందిని ప్రశ్నించారు. ఉదయం 7 గంటలలోపే అన్ని వార్డులను, ఆసుపత్రి ఆవరణాన్ని క్లీన్ చేయాలని, పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఆసుపత్రిలోని వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై రోగులకు చికిత్స అందిచడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు.

కస్తూర్బాలో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

నర్సాపూర్(జి), జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ శ్రీకాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. తనిఖీలో భాగంగా తహసీల్దార్ శ్రీకాంత్ విద్యాలయంలోని వంటగది, బోధన గదులు, టాయిలెట్స్ వంటి అన్ని ముఖ్యమైన విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా విద్యాలయం యాజమాన్యం, సిబ్బందితో మాట్లాడిన శ్రీకాంత్ విద్యార్థుల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కొత్తగా నిర్మించిన కళాశాల విద్యార్థుల భవనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని, అధికారికంగా ప్రారంభించాలని విద్యార్థులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్ ● భూ భారతి దరఖాస్తులు, రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై సమీక్ష ● పాల్గొన్న అధికారులు



కొరటికల్ పాఠశాలలో లెక్కలు బోర్డుపై రాస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

నిర్మల్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూ భారతి దరఖాస్తులు, రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, తిరస్కరణలు జరిగితే స్పష్టమైన కారణాలతో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని సమీకరించుకోవాలని సూచించారు. అలాగే త్వరలో జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన సందర్భంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలాల్లో, పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఆర్. సుదర్శన్, డీఎస్‌వో రాజేందర్, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● పాఠాలు బోధించి.. లెక్కలు చేయించిన కలెక్టర్

మామడ: మండలంలోని కొరటికల్ గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి, లెక్కలు స్వయంగా బోర్డ్‌పై చేసి పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా బోర్డ్ పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి నోట్‌బుక్స్, యూనిఫామ్స్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వంటగదిని పరిశీలించి, భోజన మోనూ వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుచి, శుభ్రతలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్వయంగా భోజనం వడ్డించారు. తర్వాత చిన్నారులతో కలిసి కూర్చొని ముచ్చటిస్తూ మధ్యాహ్న భోజనం తిన్నారు. భోజనం బాగుంది. ప్రతిరోజు ఇలానే పిల్లలకు వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో కలీం, ఏపీవో శివాజీ, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



◄ ● మృతి చెందిన కౌలు రైతు గజేంధర్ (ఫైల్)

కుంటాలలో కౌలు రైతు ఆత్మహత్య

కుంటాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాలకు చెందిన రాజారపు గజేందర్(49) అనే కౌలు రైతు శనివారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఏఎస్ఐ జీవన్ రావు తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు గజేంధర్ గత ఐదేళ్లుగా ఇతర రైతుల నుంచి 11 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతియేటా పంటలు సరిగా పండక.. పెట్టిన పెట్టుబడులు నిండక అప్పులు ఎక్కువయ్యాయని, అంతేకాకుండా అప్పులు ఎలా తీర్చాలో బెంగతో శనివారం ఉదయం కుటుంబ సభ్యులకు చేనులోకి వెళ్లివస్తానని చెప్పి వెళ్లి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ జీవన్‌రావు తెలిపారు.

జిల్లాలో సీసీ టీవీ నెట్‌వర్క్ ఆధునికీకరణ

● నిర్మల్ కమాండ్ కంట్రోల్‌కి అనుసంధానం
● ప్రజల రక్షణ కోసం ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి : ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లావ్యాప్తంగా ఉన్న సీసీ టీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడానికి ఎస్పీ జానకీ షర్మిల పోలీస్ సిబ్బందితో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలను సమగ్రంగా సేకరించి, కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానం చేయడం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్లూ కోర్ట్‌లు, పెట్రోకార్లు, కమ్యూనిటీ కాంటాక్ట్ కెమెరా 'నేను సైతం' ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సమాచారాన్ని ప్రతి పోలీస్ స్టేషన్ సిబ్బంది భౌతికంగా పరిశీలించి, 10 రోజుల్లోగా అప్డేట్ చేయనున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కెమెరాలకు నెట్‌వర్క్ (ఇంటర్నెట్ కనెక్షన్)ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆలయాలు, మసీదులు, బస్టాండ్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు, మార్కెట్ ప్రాంతాలు, పాఠశాలలు వంటి కీలక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఉన్న కెమెరాలను నిర్మల్ కమాండ్ కంట్రోల్‌కి అనుసంధానం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా భద్రత వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. ప్రజల భద్రత, నేర నివారణ, పబ్లిక్ మానిటరింగ్‌లో ఇది ఒక ముందడుగు అని పేర్కొన్నారు. బ్లూకోర్ట్‌లు, పెట్రోకార్ సిబ్బంది ప్రజల రక్షణ కోసం నిరంతరం కార్యాచరణలో ఉండటం అభినందనీయం అన్నారు. వారు చేస్తున్న సేవలు, సీసీ కెమెరాల ఆధునికీకరణ కార్యక్రమంలో వారి భాగస్వామ్యం చాలా కీలకమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

మహిళలను ప్రోత్సహించేందుకే ఫుడ్ ఫెస్టివల్ : మున్సిపల్ కమిషనర్

ఖానాపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకే ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన ఆయా రకాల వంటకాలను సుందర్ సింగ్ పరిశీలించారు. మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలలో తాము సైతం వ్యాపార రంగంలో రాణించగలమనే ఆత్మస్థైర్యాన్ని ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు పెంపొందిస్తాయన్నారు. స్వయ ఉపాధి పొందేందుకు మహిళలకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలను అందజేసి మహిళలు స్వచ్ఛందంగా చేసుకునే వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పలువురు హాజరయ్యారు.



వంటకాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్



నర్సాపూర్(జి)లో భారీ వర్షానికి జలమయమైన జాతీయ రహదారి

జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

నిర్మల్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఓ మోస్తరు వర్షపాతం నమోదు అయ్యింది. దీనిలో భాగంగా జిల్లా సగటు వర్షపాతం 3.4 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లాలో అత్యధికంగా మామడ మండలంలో 43.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టుల నీటి మట్టాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నీటి మట్టం 3.522 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 74 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. వానాకాలం పంటల సాగు కోసం లెఫ్ట్ కెనాల్ ద్వారా 755 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే రైట్ కెనాల్ ద్వారా 14 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రమైన నర్సాపూర్(జి)లో శనివారం అతి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్న రైతులకు ఎంతో ఊరట ఇచ్చింది. భారీ వర్షం కురవడంతో రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయితే ఎడతెరిపి లేని వర్షానికి మండల కేంద్రంలోని రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. మురికి కాలువలు నిండిపోయి రోడ్లపైకి నీరు ప్రవహించడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డుపనులను పరిశీలిస్తున్న అనిల్‌జాదవ్

భీంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరంజి(టి) నుంచి దన్నోరా వరకు 20 కిలోమీటర్ల రోడ్డు వర్షాకాలంలో మరి అధ్వాన్నంగా తయారుకావడంతో బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులను శనివారం గోమూత్రి అంతర్గం నడుమ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. భీంపూర్ మండల బీఆర్ఎస్ కన్వీనర్ మేకల నాగయ్య కూతురు హర్ష గత కొన్ని రోజుల క్రితం అకాల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, మాజీ ఎంపీపీలు కుడి మేత సంతోష్, తుల శ్రీనివాస్, న్యాయవాది కె. శ్రీకాంత్, నాయకులు తిరుమల్‌గౌడ్, గుర్ల నరేందర్, గోప మహేందర్, బక్కి కపిల్, ముకుందా సంతోష్, మార్శెట్టి అనిల్, షేక్ అనిల్ ఉన్నారు.

రాజభవన్‌ని సందర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే



లక్ష్మీనారాయణ దేవస్థానం సందర్శించిన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ హరిజనుల కోసం మొదటిసారిగా తెరిచిన ఆలయాన్ని శనివారం వెడ్మబొజ్జుపటేల్ దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని సేవాగ్రామ్ పర్యటనలో భాగంగా బజాజ్ రాజభవన్‌ని సందర్శించి రాజభవన్ అధికారులతో చర్చించారు. క్విట్ ఇండియా మూమెంట్ నాటి మహాత్మాగాంధీ అనుభవాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా అదే ఆవరణలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయాన్ని సందర్శించారు.

కుప్పలు తెప్పలుగా సీఆర్టీ దరఖాస్తులు

ఉట్నూర్, జూలై19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షి టీచర్ల పోస్టుకు అభ్యర్థుల దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కలుపుకొని 25 సీఆర్టీ ఖాళీల భర్తీ చేయనుండగా, ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే మరో 50 సీఆర్టీలను భర్తీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతబడిన 17 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు తెరిపించడానికి ఉపాధ్యాయుల అవసరం ఉండడంతో ఐటీడీఏ అధికారులు సీఆర్టీల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదటి రోజు 600 దరఖాస్తులు రాగా రెండోరోజు వెయ్యి దరఖాస్తులు వరకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. తేదీ ముగిసే వరకు 3000 వరకు దరఖాస్తులు రావచ్చని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గిరిజన నిరుద్యోగులు తరలివస్తు దరఖాస్తులు సమర్పించుకుంటున్నారు. అయినా కూడా అధికారులు ఒకే ఒక కౌంటర్ ఏర్పాటు చేసి సీఆర్టీల దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో మహిళ అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. 27న సీఆర్టీల పరీక్ష నిర్వహించడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తేదీ ఖరారు చేశారు.

కన్నుల పండువగా బోనాలు



ఉట్నూర్‌లో బోనమెత్తిన మహిళ టీచర్లు, విద్యార్థులు

ఉట్నూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల పండుగను నిర్వహించుకున్నారు. ఆదివారం జరుగనున్న బోనాల పండుగ పురస్కరించుకుని హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో, పోతురాజు వేషాధారణలో అందరిని అలరిస్తూ నృత్యం చేస్తూ పొచమ్మ వాడ గుడిలో బోనాలు సమర్పించారు.

బోథ్ : మండలంలోని వేదం పాఠశాలలో శనివారం బోనాల పండుగ కార్యక్రమాన్ని విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పచ్చిపాల సంతోష్ బోనాల పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సోనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో శనివారం ఆషాడ మాసం బోనాల పం డుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో శనివారం విద్యార్థులు గోరింటాకు సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనురాధ, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించాలి

ఉట్నూర్, జూలై19 (ఆంధ్రజ్యోతి):తుడందెబ్బతో పాటు ఆదివాసీ సంఘాలు ఇచ్చిన ఉమ్మడి జిల్లా బంద్‌కు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్తి దాదిరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావులు కోరారు.శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని వ్యాపారస్థుల సంఘం అధ్యక్షుడు ఠాకూర్‌గోపాల్‌సింగ్ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో త్రిమూర్తి, శత్రుశావ్, ఆనందరావు, వినేష్ తదితరులున్నారు. జిల్లా బంద్‌కు కోలాం సేవా సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని ఉట్నూర్ మండల కోలాం సేవా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొడప బాపురావు, సిడాంబాపురావులు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు టేకం మాదవరావు, టేకం లేత,కొడప భీమ్రావు, సిడాంకృష్ణ పాల్గొన్నారు.

ఇచ్చోడ : జీవో నెంబర్ 49 రద్దు కోసం ఈ నెల 21న చేపట్టిన బంద్ పాటించాలని ఆదివాసీ నాయకులు తెలిపారు. శనివారం ఇచ్చోడ మండలం దుబార్‌పేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఆదివాసీ బిర్డ్ గోండు తోటి పీవీటీజీ జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్, నాయకులు పవన్, సురేందర్, గంగాధర్, గంగాదేవిఉన్నారు.

సిరికొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో నెం.49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కొంర యాదవ్ రావు, రిమ్మ రాయి సెంటర్ సార్మేడీ అమృత్ రావ్, రిమ్మ మాజి సర్పంచ్ అనిల్ కుమార్, కొమరం భీమ్ మండల అధ్యక్షుడు కోట్నాక్ పాండు, లచ్చింపూర్ మాజి సర్పంచ్ పెందూర్ భగవంత్ రావ్, పోచంపల్లి మాజీ సర్పంచ్ లచ్చు, మహదు పాల్గొన్నారు.

బోథ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమరం భీమ్ కన్జర్వేషన్ కారిడార్ పేట తీసుకువచ్చిన జీవో నెంబర్ 49 వెంటనే రద్దు చేయాలని తుడుం దెబ్బ ఆదివాసి సంఘాల వారు పార్టీ బి రాయి సెంటర్ సోనాల మండలం తుడుందెబ్బ అధ్యక్షులు లక్ష్మణ్ ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మస్రం భూమన్నలు డిమాండ్ చేశారు.

'పేదల సంక్షేమమే ధ్యేయం'

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ప్రజాసేవ భవన్ లో భోరజ్ మండలం పెండల్వాడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ లో చేరగా.. వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం

ఆదిలాబాద్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డ్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, నిర్మాణ్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన వస్తు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు గులుమూరు రామచంద్రరావు పాల్గొన్నారు.

బోథ్ ఎమ్మెల్యేను కలిసి ఉపాధ్యాయులు

నేరడిగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గరాం బి గ్రామంలో గల ఎంపీయూపీఎస్ పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలో గల తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించి త్వరలోనే స్టేజీ నిర్మాణం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్. ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీత. ఉపాధ్యాయులు వెంకటరమణ. లీలావతి ఉన్నారు. భీంపూర్ మండలంలోని పాలోది నుండి గుబిడి పల్లె గ్రామం వరకు రూ. 10 లక్షలతో మొరం రోడ్డు మంజూరు చేయించినందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ను గుబిడి పల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే నివాసంలో శనివారం శాలువతో సన్మానించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆడే గజేందర్

నేరడిగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కలిశారు. బోథ్ నియోజకవర్గానికి చెందిన ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా బజారుహత్నూర్ మండలానికి చెందిన మల్లెపూల నర్సయ్య, బోథ్ మండలానికి చెందిన బోథ్ బ్లాక్ ఆత్మ కమిటీ అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్‌లు నూతనంగా ఎన్నికైన సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్‌లు శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లోపీసీసీ అధ్యక్షుడిని కలిశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సిరికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రానికి చెందిన బాదిత కుటుంబాలను బోథ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు శనివారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఎగ్గిడి మల్లేష్ అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఎండీ సమద్‌లు మృతి చెందిన విషయం తెలుసుకున్న బాపురావు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

తలమడుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం గ్రామ పరిపాలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాధికారి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం చదువుతోపాటు ఆరోగ్య పరిరక్షణ గ్రామ పరిపాలనపై ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారన్నారు.

వణుకు పుట్టిస్తున్న.. డెంగీ!

(5వ పేజీ తరువాయి...)

మ్యాక్ ఎలిసా టెస్టును చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒక వేళ ర్యాపిడ్ టెస్టులో పాజిటివ్ వచ్చిన ఏలిసా టెస్టులో మాత్రం నెగెటివ్ వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదంటున్నారు. ప్లేట్‌లేట్స్ 3 లక్షల నుంచి 2లక్షల వరకు పడిపోయిన పెద్దగా ప్రమాదం ఉండదంటున్నారు.20 వేల నుంచి 30వేల లోపు ఉంటేనే ప్రమాదం అని గుర్తించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కాని ప్రైవేట్ ఆసుపత్రులు డెంగీ బాధితుల సంఖ్యను గోప్యంగా ఉంచి వైద్యం అందించడంతో అసలు కేసులు బయటకు రావడం లేదంటున్నారు.

రాత్రంతా దోమల మోత

వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్న జిల్లాలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. దీంతో రాత్రంతా దోమల మోతతో కంటి మీద కునుకే లేకుండా పోతుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రాత్రంతా జాగారమే చేయాల్సి వస్తుంది. మునిసిపాలిటితో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఇంకా మూలనే కనిపిస్తున్నాయి. బ్లీచింగ్ లాంటి చర్యలు కూడా పెద్దగా చేపట్టినట్లు కనిపించడం లేదు. దోమల బెడద పెరిగి పోవడంతోనే డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వ్యాప్తి పెరిగి పోతుందని బాధితులు వాపోతున్నారు. వారానికి రెండు సార్లు నామమాత్రంగానే డ్రైడేను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సిరికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాజీ కోఆప్షన్ మెంబర్ ఇక్బాల్ తండ్రి సమద్ సెట్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం సమద్ సెట్ కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచులు పెంటన్న. రోహిదాస్ సూర్యకాంత్ మాజీ మార్కెట్ ఛైర్మన్ తిరుమల గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు పాండు,సుభాష్, మాజీ ఉపసర్పంచ్ చిన్న రాజన్న, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేష్. మాజీ ప్రభుత్వ పాఠశాల ఛైర్మన్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దాహం వేస్తోందని నీళ్ల బాటిల్ అనుకోని పురుగుల మందు తాగి గిరిజన యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పూజ,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఆడ వెంకటి కుమారుడు ఆడ ప్రవీణ్ కుమార్ (22)అనే గిరిజన యువకుడు మంగళవారం తన పంట పొలంలో మొక్కజొన్న పంటకి రక్షణ కోసం రాత్రి సమయంలో వెళ్ళాడు. అతనికి దాహం వేయడంతో పక్కనే ఉన్న బాటిల్ నీళ్ళనుకొని పురుగుల మందును తాగేశాడు.తర్వాత తాగిన బాటిల్ ను గమనించిన యువకుడు పురుగుల మందు తాగనని తన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పూజా తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌వీ సదస్సులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బనకచర్లతో పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి పాల్పడుతోందని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా సమన్వయకర్త బుట్టి శివకుమార్ ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుట్టి శివకుమార్ మాట్లాడుతూ.... గోదావరిలో తెలంగాణ నీటి వాటా తేల్చేవరకు బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం అనే నినాదంతో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో విద్యార్థులను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్.వీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాగ్మరే ప్రశాంత్, నాయకులు ఎలుగు ప్రేమేందర్, రఘు, కలీమ్, వెంకన్న యాదవ్, మోబిన్, రాజేష్, అభిలాష్, శివ, కల్యాణ్, సాయికృష్ణ, హరిశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

నిర్మల్ చైన్‌గేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అమ్ముల భూషణ్ కరాటే అకాడమీలో బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ తేజేంద్ర సింగ్ భాటియా తెలిపారు. అనంతరం గ్రేడింగ్ పరీక్షలలో సీనియర్ బ్లాక్ బెల్ట్ 2లో అరెఫ్ ఖాన్, నారాయణ, బ్లాక్ బెల్ట్ 1లో వకుల్ రెడ్డి, షేక్ అమన్, ఇర్ఫాన్ ఖాన్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లు, ధ్రువ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, అమ్ముల భూషణ్, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత

దస్తురాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో ఉంటున్న మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన వెన్నమనేని ప్రవీణ్ కుమార్ స్థానిక ప్రాథమిక పాఠశాలకు భారీ విరాళం అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ కొరకు రూ. 75,000లను పీఏసీఎస్ ఛైర్మన్ రామడుగు శైలజ రమేష్ రావు చేతుల మీదుగా మండల విద్యాధికారి గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మచారికి అందజేశారు. ఆయన చదువుతున్న పాఠశాలకు చేస్తున్న సేవలకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

సారంగాపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గల పొట్యా గ్రామానికి చెందిన పొటెండ్ల భీమేష్(34) అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం స్వర్ణ ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు భీమేష్ చేపలు పడుతూ ప్రమాదశాత్తు చేపలు పట్టే వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నలుగురి బైండోవర్

ఖానాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం రాత్రి పరస్పరం గొడవ పడిన నలుగురు వ్యక్తులను శనివారం ఖానాపూర్ తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన ఫిరోజ్ ఖాన్, షేక్ ఇర్ఫాన్, సయ్యద్ నజీర్, సయ్యద్ బాబు నలుగురు వ్యక్తుల మధ్య డబ్బుల విషయంలో వివాదం తలెత్తినట్లు ఎస్సై పేర్కొన్నారు. డబ్బుల విషయంలో తలెత్తిన వివాదంతో ఈ నలుగురు ఖానాపూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం రాత్రి ఒకరితో ఒకరు గొడవకు దిగారు. విషయం తెలుసుకుని నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎదుట సదరు నలుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించి తిరిగి గొడవకు కారణమైన వారిపై బైండోవర్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అమ్మా... బోనమందుకో...



హాజరైన మాజీ ఎంపీపీ ఆకుల శోభారాణి, తదితరులు

ఖానాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారికి తాము సైతం బోనాన్ని సమర్పిస్తామంటూ హైస్కూల్ విద్యార్థులు ఖానాపూర్‌లో బోనాలతో మహాలక్ష్మి ఆలయానికి తరలి వెళ్లారు. మాజీ ఎంపీపీ ఆకుల శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బోనాల పండుగ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణలో అలరించారు.

ఘనంగా బోనాల వేడుకలు

నిర్మల్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను చాటేవే బోనాల పండుగ అని చాణక్య పాఠశాల డైరెక్టర్ సిహెచ్. వెంకట్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని గాయత్రి టౌన్‌షిప్‌లో గల పాఠశాల ఆవరణలో శనివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ టి. ప్రమోద్ రావు, సిహెచ్. వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఏ. హరీష్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముథోల్ : ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఫ్యూచర్ కాన్సెప్ట్ పాఠశాలలో శనివారం 'బోనాల పండుగ' ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసా : పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో శుక్రవారం బోనాల ఉత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పాఠశాల కరస్పాండెట్ రవీందర్ స్కూల్ అవరణలో వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారి చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు చేపట్టి వేడుకలను ప్రారంభించారు.

కుంటాల : కుంటాల మండలంలోని కల్లూరు వాసవి విద్యాసంస్థలతో పాటు లింబా (కే) హైస్కూల్‌లో శనివారం బోనాల పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఈ బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోనాల యొక్క ప్రాముఖ్యతను వాటి విశేషాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో లింబా (కే) హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు అంబకంటి సతీష్, సిబ్బంది, వాసవి విద్యాసంస్థలో ప్రిన్సిపల్ సాయిలు, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

నిర్మల్ రూరల్: వాసవి పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు నిర్వహిమని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి.

మామడ : పలు గ్రామాల్లో సాంస్కృతి, సాంప్రదాయక బోనాల పండుగ అని పలు ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగులు, పూలతో అద్భుతంగా అలంకరించారు. పాటలు, నృత్యాలతో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు తలపై అలంకరించిన బోనాలు ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మామడ, పొన్కల్, వెంకటాపూర్ పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడుకుని రప్పించాలని వినతి

మామడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ దేశం వెళ్లి కాయ కష్టం చేసుకుని పది రూపాయలు సంపాదించాలన్న ఆశతో వెళ్తే అక్రమ కేసు పెట్టి నా కొడుకుని అకారణంగా ఇబ్బందులు పెడుతున్నారని నా కొడుకుని స్వదేశానికి రప్పించాలని జిల్లా కలెక్టర్‌కు గోడు వెళ్లబోస్తూ విన్నవించిన సంఘటన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన గొర్రె రాజేందర్ ఊరిలో కూలీ పనులకు వెళ్తుండగా తన మిత్రులు దుబాయ్ దేశం వెళ్లి పనులు చూసుకుందామని అనగా స్థానిక సబ్ ఏజెంట్ ద్వారా 1000 దినార్ల జీతంతో క్లీనింగ్ పనికి వెళ్లగా ఒకటిన్నర సంవత్సరం పైగా పని చేస్తున్న సమయంలో రాజేందర్ అకామా నెంబర్ కలిగిన బ్యాంక్ సాలరీ ఖాతాకు 2000 దినార్లు అక్రమంగా బదిలీ కావడం వల్ల కంపెనీ పని లేదనండంతో ఇంటికి వద్దామని విమాన టికెట్ కొనుగోలు చేసి దుబాయ్ విమానాశ్రం వెళ్లగా, అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు రాజేందర్ మీద ఆ నగదుకు సంబంధించిన కేసు దర్యాప్తులో ఉండటం వల్ల ఇండియా వెళ్లడం కుదరదని దీంతో ప్రతి రోజు రాజేందర్ పోలీస్ స్టేషన్, ఎంబసీ చుట్టూ 6 నెలలుగా తిరుగుతూ స్నేహితుల వద్ద జీవనం వెల్లదీస్తున్నాడు. కొడుకుని స్వదేశానికి రప్పించాలని శనివారం తండ్రి గొర్రె గంగన్న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి అనంతరం ఎన్ఆర్ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్లను కలిసి తమ కొడుకును ఇండియా తీసుకొని వచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. ఇండియన్ ఎంబసీ దుబాయ్ ప్రవాసి సహాయత కేంద్రానికి ఈమెయిల్ ద్వారా తెలిపి రాష్ట్ర జీఏడీ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసి విచారణ చేపడుతున్నామని దుబాయ్ పోలీసులు అంటున్నారు.

'సన్నాల బోనస్ చెల్లింపులు వెంటనే చేపట్టాలి'

భైంసా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి చేయూతనిచ్చేందుకుగాను సన్నాల బోనస్ చెల్లింపులను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతికూల పరిస్థితులతో వానకాలపు పంటల సాగు ప్రక్రియలో అన్నదాతలందరూ అగచాట్ల పాలవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఒక్కో రైతు రెండేసి పర్యాయాలు విత్తనాలు వేయడంతో సాగు వ్యయభారం రెట్టింపయ్యిందన్నారు. ఈ కారణంగా రైతాంగం ప్రస్తుతం ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సత్వరమే పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టాలన్నారు.

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఆర్ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం నియోజక వర్గ పరిధిలోని ఆర్ఎంపీలు భైంసాలో ఎమ్మెల్యే పాటిల్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎకరువు పెట్టారు. వైద్య,ఆరోగ్యశాఖాధికారుల దాడులు నిలువరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటిల్ మాట్లాడుతూ పేద,మధ్య తరగతి ప్రజానీకానికి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలపై వైద్యశాఖాధికారులు వేధింపు విధానాలను అవలంబించరాదని సూచించారు. తప్పు చేసిన ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలే తప్ప అందరిని ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదన్నారు. ఇదే క్రమంలో ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని హితవు పలికారు. ఇందులో నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల, భైంసా పట్టణ ఆర్ఎంపీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

బాసర,జూలై19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, స్టార్టప్‌లు పట్ల ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఆర్జీయూకేటీలో స్టార్టప్‌లు, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెనేజ్‌మెంట్ విభాగం ఈ సెల్ సంయుక్తంగా ఏర్పాటు చేశారు. ఓఎస్డీ, ఏవో ప్రొ. మురళీదర్శన్ హాజరై మాట్లాడుతూ.. అంట్రప్రెన్యూర్‌షిప్ నాయకత్వ నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలను విద్యార్థులకు విస్తృతంగా అందించేందుకు వీసీ ప్రొ. గోవర్ధన్ కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రధానంగా ప్రారంభ దశ స్టార్టప్‌లలో ఎదురయ్యే సవాళ్ల వివరించారు. ఆవిష్కరణ, స్థిరత్వం, విస్తరణ ప్రాముఖ్యతలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. భారత ఇన్నోవేషన్ వ్యవస్థలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని వెల్లడించారు. ప్రొ. మురళీదర్శన్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉన్న స్వీయ ప్రేరణాత్మక అనుభవాలను ఆత్మవిశ్వాసం కలిగే విధంగా మాట్లాడారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బాసర,జూలై19(ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రానికి చెందిన ఆలేగాం కార్తిక్‌రావు 25 అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై శనివారం మృది చెందాడు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం వాకింగ్ చేస్తుండగా.. వెనుక నుండి ఆటో ఢీ కొట్టింది. కార్తీక్ తలకు బలమైన గాయాలు కావడంతో కోమాలో వెళ్లాడు. కుటుంబ సభ్యులు మొదట నిజామాబాద్‌తో తర్వాత హైదరాబాద్ కార్పోరేట్ ఆసుపత్రిలో లక్షలు పోసి మెరుగైన చికిత్స జరిపినప్పటికీ కార్తీక్ ప్రాణాలను కాపాడకలేకపోయారు. మెదడుకు బలంగా దెబ్బ తగలడంతో కొలుకోలేకపోయారు. చికిత్స పొందుతూ.. శనివారం ప్రాణాలు విడిచాడు. కార్తీక్‌రావుని కడసారి చూసేందుకు బాసర గ్రామస్థులందరూ.. పెద్ద ఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు అయిందని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కార్తీక్ అకాల మరణంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ముథోల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండలంలోని హంగిర్గా సహకార సంఘం రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం ముథోల్‌లో హంగిర్గా సంఘ సీఈవో భూమయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిద్రేలి సంఘ సిబ్బంది సాయిరెడ్డి, నాగేశ్వర్ రావు, భూషణ్, రాము, రవి, నవీన్, ముథోల్ సహకార బ్యాంక్ మేనేజర్ రిచారాణి, సూపర్‌వైజర్ సాయి కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ముథోల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ఎంఎ లతీఫ్ ఆధ్వర్యంలో శనివారం డ్రాయింగ్ నోట్ బుక్స్, డ్రాప్ నోట్ బుక్స్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు కే. శశి కుమార్, విష్ణు, నిఖిల్, ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర చారి, నరేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కూరగాయల మొక్కలు

కుంటాల, జూలై, 19 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాలలో కిచెన్ షెడ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ నవీన్ ఆధ్వర్యంలో శనివారం కూరగాయల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సేంద్రియ పద్దతి ద్వారా కూరగాయలను పండించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం తీర్థయాత్రలకు బస్సు

కుంటాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల సౌకర్యార్థం తీర్థయాత్రలకు బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ సీఐ భారతి తెలిపారు. శనివారం ఇక్కడి భక్తుల కోరిక కుంటాల నుండి వేములవాడకు బస్సును ప్రారంభించారు. ప్రయాణీకులు ఏ గ్రామం నుండైనా ఏ సమయంలోనైనా ఎలాంటి తీర్థయాత్రలకు వెళ్లాలనుకుంటే కెపాసిటికి తగిన సిబ్బంది సిద్దంగా ఉంటే ఎక్కడి నుండైనా ఎక్కడికైనా సౌకర్యం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగపరుచుకోవాలన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుంటాల, జూలై, 19 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శనివారం కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ముత్యంరావు అనే రైతు గొర్రెలను కొట్టంలో ఉంచిన సమయంలో కుక్కలు అందులో చొరబడి రెండు గొర్రెలపై దాడి చేయడంతో మృతి చెందినట్లు రైతు తెలిపాడు. మృతి చెందిన గొర్రెల విలువ రూ. 15 వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

రెండు ఆవులు, దూడల అపహరణ

భైంసా రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ఆది సునీల్, ఆది రంజిత్, శంకర్ అనే రైతుల ఆవులను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆవులను రోజు మాదిరిగానే తన ఇంటి ముందు కట్టేసి ఉంచేవారు. ఉదయం చూసేసరికి ఆవు దూడలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. అదేవిధంగా కోతుల్‌గాం గ్రామానికి చెందిన భీమేష్ దూడ కూడా ప్రతిరోజు లాగానే ఇంటిముందు కట్టేసి ఉంచారు. ఉదయం కనిపించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై శంకర్ కేసు నమోదు చేశారు.



కుంగిపోయిన వరండా

వరండా కుంగుబాటు.. నడక తడబాటు



కుంగిపోయిన కంప్యూటర్ గది

కుభీర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఐదేళ్ల చరిత్ర కలిగిన కుభీర్ మండల పరిషత్ కార్యాలయం బాగోగులను పట్టించుకునేవారు కరువయ్యారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను మంజూరు, తప్పిదాల సవరణతో పాటు పలు కార్యక్రమాల కోసం మండల వాసులతో పాటు ప్రజాప్రతినిధులు రోజుకు వందలాదిగా కార్యాలయానికి వస్తూ వెలుతుంటారు. కుంగిపోయిన వరండా నుంచి నడుచుకుంటూ వెలుతున్నారే తప్ప అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఫ్లోరింగు, గదులు కుంగిపోవడంతో బెంచీలు, కుర్చీలు, పలు రికార్డులు బద్రపరిచే బీరువాలు ఎగుడు దిగుడుగా దర్శనమిస్తున్నాయి. కుంగిన ఫ్లోరింగ్ నెర్రెల్లో విషపురుగులకు నివాసాలుగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కార్యాలయానికి మండల ప్రజల తాకిడి పెరగనుంది. ఇప్పటికైనా భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఫొటో న్యూస్



పుర పాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పుర సభ్యులుగా మారిన విద్యార్థులు

ప్రతినెల మూడవ శనివారం బ్యాగ్ ఫ్రీ డేను అమలు చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని కొలి పుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పురపాలక సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. విద్యార్థులు కౌన్సిలర్లుగా మారి పట్టణ సమస్యలపై చర్చించడం ఆకట్టుకుంది. పట్టణ పరిధిలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు వివరించగా, చైర్మన్‌గా వ్యవహరించిన విద్యార్థి వాటిని సావదానంగా ఆలంకరించారు. మున్సిపల్ విభాగం పని తీరును , కౌన్సిలర్ల విధులను, సమావేశాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

● (ఆంధ్రజ్యోతి, ఫొటో గ్రాఫర్, ఆదిలాబాద్)

చదరంగంలో రాణిస్తున్న క్రీడాకారులు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

- చదరంగం ఆట మూలాలు మన దేశంలోనే
- నేడు అంతర్జాతీయ చదరంగం దినోత్సవం

ముథోల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చదరంగం ప్రాచీనమైన క్రీడ. మన దేశంలో చదరంగం ఎన్నో క్రియాత్మక విషయాలలో ప్రాచీన కాలం నుండి చాలా ముఖ్యమైన భూమికను పోషిస్తూ వస్తుంది. చదరంగంలో నెగ్గటమనేది ప్రాచీన భారత దేశంలో చాలా విశిష్టమైన స్థానం. రాజులకు ఈ చదరంగం యుద్ధ భూమిని మరపించేది. ప్రాచీన కాలంలో యుద్ధంలో వ్యూహాలను చదరంగ క్రీడ నుంచి తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. ఆనాటికీ, ఈనాటికీ చదరంగానికి ఉన్న ప్రా ముఖ్యత క్షీణించలేదు. పైగా దీని సంఘర్షణ లేకపోతే వ్యక్తి మానసిక, శారీరక వృద్ధి తగ్గిపోతుంది. తనకంటూ సొంత ఆలోచన, ఒక జీవిత విధానాన్ని రూపొందించు కుని సఫలీకృతుడవ్వడంలో విఫలుడైపోతాడు. నిరంతరం మాన మెదడు సమస్య విశ్లేషణలతో పరిభ్రమిస్తూ ఉన్నప్పుడే వ్యక్తిత్వంలో షార్ప్ వస్తుంది. ప్రతి సమస్యకో పరి ష్కారం ఉంటుందది. అసలు పరిష్కారం లేనిదే అది సమస్య కాలేదు. విషయమేమిటంటే అసలు సమస్యను సృష్టించేది కూడా మెదడే. ఈ ఆలోచనా ప రిణతి మానవుడిని ఆటవిక యుగం నుండి ఆటమిక్ యుగానికి తోసింది. నిజంగా ఏ జాతి చరిత్రకైనా ఇది ఓ గొప్ప అద్భుతం. దీనికంతటికీ కారణం ఆలోచన హే తుబద్ధమైన ఆలోచన. ఈ ఆలోచనే సైంటిఫిక్ థాట్‌గా ఎన్నో అద్భుతమైన విజయాలను సాధించింది - సాధి స్తూ ఉంది. అయితే అపజయాలు కూడా లేకపోలేదు. దీనిని మనం చదరంగానికి అన్వయిస్తే చదరంగం ఎ త్తులు పైఎత్తులతో కూడిన ఆట. ఆటలో పాల్గొనే ఇరువురి లక్ష్యం విజయం సాధించటం. ఆ క్రమంలో వారు అనుసరించు మార్గాలు చాలా ఆలోచనాత్మ కంగా ఉంటాయి. ఇలా మెదడు నిరంతర సాధన చే స్తూ పోతే అన్ని విషయాల్లో విజయం వరించటానికి అవకాశం ఉంటుంది. ప్రత్యర్థి దాడిని తిప్పికొట్టడంలో ఆటగాడికి ఉపకరించు ఒకే ఒక్క అంశం. అంత ర్జాతీయ చదరంగం ఆట వివరాలు జిల్లాలో రాణిస్తున్న క్రీడాకారులపై ప్రత్యేక కథనం అందిస్తుంది ఆంధ్రజ్యోతి.

చదరంగం ఆట మూలాలు భారతదేశంలోనే...

చరిత్ర ప్రకారం చదరంగం ఆట మూలాలు భారతదేశంలోనే ఉన్నట్లు అర్థమవుతుంది. గుప్తుల కాలంలో ఉత్తర భారత ఉపఖండంలో ఆడిన చతురంగ ఆటలో భాగంగానే చదరంగం మూలాలు ఉన్నాయని నమ్ముతారు. వివిధ దేశాల మధ్య వాణిజ్యం ప్రారంభమైనప్పుడు వర్తకుల ద్వారా భరతఖండం నుంచి పశ్చిమాన పర్షియా వరకు ఈ చదరంగం ఆట వ్యాపించింది. అక్కడ వారు ఈ ఆటను చత్రంగ్ లేదా షత్రంజ్ అనే పేరుతో పిలిచేవారు. ఆరవ శతాబ్దంలో గుప్తరాజు వంశ కాలంలో భారత దేశంలో చదరంగం పుట్టింది. నేడు 1500 సంవత్సరాలకు పైగా తర్వాత దీనిని సుమారు 178 దేశాలలో ఆడుతు న్నా రు.

అంతర్జాతీయ చదరంగం దినోత్సవం..

అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని 1966 నుంచి ప్రతి యేటా జూలై 20న జరుపుకుంటారు. ప్రపంచ చరిత్రలో అత్యంత పురాతనమైన, భారీ ప్రాచుర్యం పొందిన ఇండోర్ క్రీడల్లో ఇదొకటి. కాగా 1924 లో ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడీఈ) స్థాపించబడినా... అంతర్జాతీయ చెస్ దినోత్సవంగా జరుపుకునే ఆలోచనను మొదటగా యునెస్కో ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే 2019లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తించి తీర్మానంపై సంతకం చేసింది. 16వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ పోటీలను ప్రస్తుతం 178 దేశాలోల సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక మొదటిసారి జరిగిన పోటీల్లో 'విల్‌హెల్మ్ స్టీనిజ్' 1886 ఫస్ట్ టైటిల్ గెలుచుకున్నాడు. అలాగే 'వరల్డ్ చెస్ ఫెడరేషన్' 'ఇంటర్నేషనల్ కరస్పాండెన్స్ చెస్ ఫెడరేషన్'అనే రెండు అంతర్జాతీయ సంస్థలు చెస్ పోటీలను నిర్వహిస్తున్నాయి. ప్రపంచ చెస్ సమాఖ్య ప్రధాన కార్యాలయం స్విట్జర్లాంగ్‌లోని లౌసాన్‌లో ఉండగా చెస్ సమాఖ్య సీఈవోగా జాఫ్రీ డి. బోర్గ్ నియమితులయ్యారు.

నిర్మల్ జిల్లాలోని చదరంగంలో రాణిస్తున్న క్రీడాకారులు..

నిర్మల్ జిల్లాలోని ఆయా మండలంలో గల పాఠశాలలో విద్యార్థులు చదరంగంపై ఆసక్తి కనబరుస్తున్నారు. మెదడుకు పదును పెట్టే ఈ ఆట విశ్వవ్యాప్తంగా పేరుపొందింది. అయితే జిల్లాలోని పలువురు క్రీడాకారులు ఒకపక్క వృత్తిరీత్యా ఉద్యోగం చేస్తూ కార్య సమయంలో విద్యార్థులకు తమ పిల్లలకు ఈ చదరంగాన్ని నేర్పిస్తున్నారు. కొందరు జిల్లా స్థాయిలో రాష్ట్ర జలసంతం ప్రతిభ కనబరిచారు.

చదరంగం సృజనాత్మకతను పెంచుతుంది..

- గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల



ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో డిగ్రీ చదువుతున్న రోజుల్లో దక్షిణ భారత దేశంలోని యూనివర్సిటీల ఆధ్వర్యంలో మద్రాస్‌లో నిర్వహించిన చెస్ పోటీల్లో రాష్ట్రం తరపు నుంచి చెస్‌లో పాల్గొన్నాను. ఈ జ్ఞాపకం ఎప్పటికీ మర్చిపోను. వృత్తిరీత్యా నేను కుంటాల మం డలంలో ఉపాధి పథకం ఏపీవోగా పని చే స్తున్నప్పటికీ ఖాళీ సమయంలో చెస్ ఆడుతాను. అంతే కాకుండా 500ల మంది విద్యార్థులకు ఇప్పటి వరకు చదరంగం నేర్పించాను. అందులో ఉన్న మెళకువలు ఆడే పద్ధతి గురించి వివరించాను.

చెస్ ఛాంపియన్ కావాలన్నదే నా లక్ష్యం..

- సాయిశ్రీ, విద్యార్థిని



నేను ఐదో తరగతి నుంచి ఆడుతున్నాను. నేను ప్రస్తుం రబింద్రా పాఠవాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నా లక్ష్యం చెస్ ఛాంపియన్, మరోపక్క సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే ప్రధాన కోరిక. అలాగే చెస్ ఆడి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందాలన్న దృఢ సంకల్పం ఉంది. నాకు మా నాన్నగారు చెస్ గురించి మొదట్లో నేర్పారు. నాన్న ప్రోత్సాహంతోనే ఈ చదరంగంపై ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులు చెస్ పట్ల మెళకువలను నేర్పుతున్నారు.

చెస్ అంటే ప్రాణం..

- మోక్షజ్ఞ, విద్యార్థి



నేను నాలుగో తరగతి నుంచి చదరంగం ఆడు తున్నాను. నాకు ఉపాధ్యాయులు మంచి మెళకువలు నేర్పుతూ ముందుకు పంపుతున్నారు. నేను ఎనిమిదో తరగతి చదువుతున్న ఖాళీ సమయం దొరికిందంటే వెంటనే చెస్ ఆడేందుకు మొగ్గు చూపుతాను. చెస్‌లో మంచి ప్రతిభ కనబరిచి అందరితో మెప్పు పొందాలన్నదే నా లక్ష్యం.

జిల్లాస్థాయిలో తొలి స్థానం..

- రేగుంట ఋషిక్, విద్యార్థి



నేను పదవ తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి చదరంగం పోటీలో మొదటి స్థానంలో నిలిచాను. నాకు మంచి గుర్తింపు రావాలనే ఉద్దేశ్యంతోనే చదరంగం పై ఫోకస్ చేశాను.

చదరంగం అంటే చాలా ఇష్టం..

- ఎం. మధుప్రియ, విద్యార్థిని



చదరంగం అంటే నాకు ఇష్టం. నేను నర్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. సెలవులలో సమయం దొరికిన ప్రతిసారి ఓ గంట రెండు గంటల పాటు చదరంగం ఆడుతాను.

మేము ఆడం.. మా పిల్లలకు నేర్పుతున్నాం..

- గాండ్ల లక్ష్మణ్, చెస్ ఆటగాడు



నా చిన్నతనంలో చెస్ ఆట ఆడేందుకు ప్రతిరోజు కనీసం రెండు గంటలు కేటాయించే వారి ని చెస్ ఆడడం వల్ల మేధాసంపత్తి పెరగడంతో పాటు చురుకుదనం అలవాటు అవుతుందని చెస్ ఆటగాడు గాండ్ల లక్ష్మణ్ పేర్కొంటున్నారు. అయితే క్రీడ క్రమక్రమంగా కనుమరుగవుతూ ఉండడంతో తాను తమ ఇంట్లో మనవడు,మనవరాలుకు చెస్ నేర్పుతున్నామన్నారు.

మేథో సంపత్తికి ఎంతో మేలు చెస్

బోథ్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చెస్ ఆడడం అంటే ఒకప్పుడు చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ఆసక్తి కనబరిచేవారు. చెస్ ఆట వల్ల మెదడుకు మేత అని పెద్దలు పేర్కొనేవారు. చెస్ ఆడటం వల్ల తెలివితేటలు పెరుగుతాయని అనుభవజ్ఞులైన ఆటగాళ్లు అంటున్నారు. ఒకప్పుడు పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తే ఎంతోమంది పోటీపడి చెస్ ఆట పోటీల్లో పాల్గొనే వారిని అయితే క్రమక్రమంగా మారుతున్న కాలంతో పాటు చెస్ ఆడడం మర్చిపోతున్నారని అనుభవజ్ఞులైన వారు అంటున్నారు.

● **చెస్ నేర్పే వారు కరువు**

వివిధ పాఠశాలల్లో ప్రతి ఏడాది చెస్ పోటీలను నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం చెస్ ఆట నేర్పేవారు లేకపోగా చెస్ ఆడేవారు సైతం లేకపోవడం వల్ల చెస్ ఆట పైన పట్టు లేకుండా పోతుంది. తగ్గుతున్న ఈ ఆటకు ప్రాధాన్యం పెరగాలంటే పాఠశాలల్లో ఈ ఆటపైన అనుభవజ్ఞుల చేత విద్యార్థులకు పట్టు వచ్చేలా నేర్పించాల్సిన అవసరం ఉంది. ఆలోచనతో కూడిన ఈ ఆటలు నేర్పించుకుంటే విద్యార్థుల్లో తెలివితేటలు పెరుగుతాయంటున్నారు.

● **ఆటను ప్రోత్సహించాలి**

- సురేష్ వైద్య, సీనియర్ క్రీడాకారుడు



చెస్ ఆటను ప్రోత్సహించేవారు లేకపోవడం వల్ల ఆట నేటితరం వారికి తెలియకుండా పోతుందన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో, పట్టణాలలో యువకులు చెస్ ఆటను ఆడేవారన్నారు. ప్రస్తుతం యువత చెస్ ఆటపై దృష్టి సారించకపోగా వాలీబాల్ క్రికెట్ వంటి ఆటలపై దృష్టి సారిస్తున్నారన్నారు.

ఆదర్శం.. ఈ ఉపాధ్యాయ బృందం

- విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఆటో సౌకర్యం ఏర్పాటు..
- రాత్రి వేళల్లో భద్రత పరంగా తలెత్తుతున్న సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయుల విన్నపం

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేలకు వేలు ఫీజులు వసూలు చేసినా.. విద్యార్థుల రాకపోకలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల డబ్బులను తీసుకోవడం సాధారణమే. అయితే పట్టణంలోని కొలిపుర ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం మాత్రం విద్యార్థుల రాకపోకలకు అవసరమయ్యే ఖర్చులను తామే భరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఖానాపూర్ చెరువు సమీపంలో ఉన్న పాఠశాల చుట్టుపక్కల నివాస ప్రాంతా లు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉండేది. ప్రవేశాలు తక్కువగా కావడానికి ప్రధాన సమస్యను గుర్తించిన ఉపాధ్యాయులు దానిని పరిష్కరించే దిశగా ముందడుగు వేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి రాకపోకలకు ఇబ్బంది ఎదురుకావడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. ఇందుకుగానూ పాటశాలకు దూరంగా ఉండే కే.ఆర్.కే కాలనీ లో ఉన్నత పాఠశాల లేదని గుర్తించి అక్కడ ప్రాథమిక పాటశాలలో చదువుతున్న విద్యార్థులను ఇక్కడికి రప్పించారు. అవసరమైతే తామే తలో కొంత డబ్బులు జమ చేసి ఆటో ఖర్చు భరిస్తామని తల్లితండ్రులకు నచ్చచెప్పారు. దూరాభారం అయినప్పటికీ రవాణా ఖర్చులు కలిసి వస్తుండడం, అన్ని వసతులు కల్పిస్తుండడంతో తల్లితండ్రులు సైతం ఇందులో చేర్చేందుకు ఆసక్తి చూపడం ప్రారంభించారు. ఒకప్పుడు కేవలం 25 మంది విద్యార్థులు ఉండే పాటశాలలో ప్రస్తుతం సంఖ్య ??కి చేరడం ఉపాధ్యాయుల పని తీరుకు అద్దం పడుతుంది. ఏడాదికి దాదాపు రూ.2 లక్షల 25 వేల వరకు ఖర్చు వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే సాయంత్రం సమయాల్లో ఆకతాయిల కారణంగా భద్రత పరంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. స్థానికంగా ఉండే వారు కాకుండా ఎక్కడినుండో వచ్చే ఆకతాయిలు పాఠశాల మూసివేసిన తర్వాత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, తాళాలు పగలగొడుతుండడంతో ప్రత్యేకంగా నట్‌బోల్ట్ ద్వార ప్రధాన ద్వారాన్ని బిగిస్తున్నామని చెప్పారు. పోలిసు యంత్రాంగం పాటశాలపై కొంత దృష్టి సారించి ఆకతాయిల పని పట్టాలని కోరుతున్నారు.



పాఠశాల ఉపాధ్యాయ బృందం

సమష్టి కృషి ఫలితమే..

- మురళీ, ప్రధానోపాధ్యాయులు



పాటశాలలో పని చేస్తున్న ఎనిమిది మంది ఉపాధ్యాయులు ప్రతీ నెల మూడు వేల రూపాయల చొప్పున ప్రత్యేకంగా ఇందుకు జమ చేస్తున్నాం. ఆటోల ఖర్చు కలిసివస్తుండడంతో తల్లితండ్రులు సైతం పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొదట్లో కొంత ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం పరిస్థితు లు చక్కదిద్దుకున్నాయి. దాతల సహకారంతో అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకువచ్చాం.

అందరం భాగస్వాములమే..

- రవీంద్ర, ఉపాధ్యాయుడు



విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండేదని ఎంతో మనోవేదన చెందేవాళ్లం. ఎట్టి పరిస్థితుల్లో అయినా సంఖ్య పెంచాలన్న సంకల్పంతో పర్యటించి సమస్యను గుర్తించాం. తలో కొంత డబ్బు ఇచ్చేందుకు ఉపాధ్యాయులు ముందుకు రావడంతో ఆటోలను ఏర్పాటు చేసి వాటి ఖర్చును మేమే భరిస్తున్నాం. పాటశాలలో రాత్రి పూట భద్రత పరంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఎంతో సంతోషంగా ఉంది..

- నివేదిత వాఘ్మారే, 9వ తరగతి, కేఆర్‌కే కాలనీ



మా ఇంటి వద్ద ఏడవ తరగతి వరకు మాత్రమే పాఠశాల ఉండేది. అక్కడి నుంచి ఈ పాటశాలకు వచ్చేందుకు మా ఉపాధ్యాయులే రవాణా సౌకర్యం కల్పిస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉండడం లేదు. ఉపాధ్యాయులు మమ్మల్ని ప్రోత్సహించడం నిజంగా మా అదృష్టం.

ఇబ్బంది లేకుండా వవస్తున్నాం ..

- సాయి తేజ, 9వ తరగతి, కేఆర్‌కే కాలనీ



పాఠశాలకు మా ఇల్లు దూరం అయినప్పటికీ ఉపాధ్యాయుల చొరవతో ఎటువంటి ఇబ్బంది లేకుండా రాగలుగుతున్నాం. మా కోసం మూడు ఆటోలు ప్రత్యేకంగా వచ్చి ఇంటి నుంచి పాటశాలకు తీసుకుని వస్తాయి. ఉపాధ్యాయులు మాపై చూపుతున్న ప్రేమ ఎన్నటికి మరిచిపోలేము.

మేఘమా వర్షించు

● రైతాంగాన్ని కరుణించు! ● వర్షం కోసం అన్నదాతల చూపు



పెరిగిన పత్తి మొలకలకు నీళ్లు పెట్టి కాపాడే ప్రయత్నం చేస్తున్న రైతులు

తాంసి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చినుకు లేక సరిగ్గా నేటికీ పదిహేను రోజులు.. అప్పడే మేఘాలు మబ్బులు బారుతుండటం, అంతలోనే వెలుతురు కావడంతో రైతులు మేఘం వైపు చూస్తూ.. మేఘమా వర్షించు అంటూ వేడుకుంటున్నారు. అసలే పత్తి మొలకలు పెరగడం లేవు. దానికి తోడు వర్షం కురియక మరింత పెరుగుదల నిలిచిపోయింది.

● **దినమంతా ఎండలు**

సాయంత్రం అయిందంటే మబ్బులు.. చీకటి పడిందంటే ఉక్కపోత అసలు ఇదేమి కాలమన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో రాక మానడం లేదు. దీంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొంతమంది వారి పొలాల్లో ఉన్న తుంపర్ల సేద్యంతో మొలకలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాంటి నీటి సౌకర్యం లేని రైతులు ఇంట్లో చెద్దరు కప్పుకొని ములుగు గుతున్నారు. ఏమి చేయాలో తెలియక చాలామంది రైతులు మంచం పట్టారు. ప్రస్తుతం తాంసి మండలంలోనే కాదు, అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి అంటే అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. మరో రెండు, మూడు రోజుల్లో కనుక వర్షం కురియకపోతే మొలకలాన్ని మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. వరుణదేవుడు కరుణించి రైతులను ఆదుకోవాలని ఆశిద్దాం.

హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌కు బాలిక ఎంపిక



ఎంపికైన శ్రావణి

ఉట్నూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సైతం ఉన్నత అవకాశాలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత ప్రాథమికొన్నత పాఠశాల హెచ్‌ఎం జ్యోతితో పాటు ఉపాధ్యాయులు తమ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని శ్రావణితో పాటు మరికొందరు రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాల పోటీలకు హాజరుకాగా నాలుగో తరగతి విద్యార్థిని శ్రావణి ఎంపికయ్యారు. తండ్రి లేని లోటు తీర్చుకుంటు పిల్లలను కష్టపడి చదివిస్తున్న తల్లి లావణ్యను కూడా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని శ్రావణితో కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి హకీంపేట్ హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శ్రావణి మరింత మంది పిల్లలకు ఆదర్శంగా ఉంటుందని ఎంఈవో ఆశన్న, జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు జాదవ్‌రమేష్, ప్రాథమికొన్నత పాఠశాల హెచ్‌ఎం జ్యోతిలు అన్నారు.

బోనాల జాతరకు ముస్తాబైన గట్టు మైసమ్మ క్షేత్రం

● నేడు బోనాలు సమర్పించనున్న భైంసా వాసులు



ముస్తాబైన గట్టు మైసమ్మ ఆలయం



శోభాయమానంగా గట్టు మైసమ్మ క్షేత్రం

భైంసా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని మహిమాన్విత గట్టు మైసమ్మ క్షేత్రం ఆదివారం నిర్వహించే బోనాల జాతరకు సర్వంగా సుందరంగా ముస్తాబైంది. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహక కమిటీ శ్రేణులు ఆలయాన్ని, అమ్మవారి విగ్రహాన్ని శోభయమానంగా ఆలంకరించారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నీ తోరణాలతో, విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. బోనాల సమర్పణకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. బోనాలు సమర్పించే సమయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు గాను బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నింటిని మెరుగుపరిచారు.

● **ఉదయం 9 నుంచి ప్రత్యేక పూజలు**

బోనాల జాతరను పురస్కరించుకొని గట్టు మైసమ్మ క్షేత్రంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్, ఆయా కుల, కాలనీ సంఘాల ప్రతినిదులు, రాజకీయ పార్టీల ప్రముఖులు ఉదయం జరిగే పూజ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

● **కాలనీల వారీగా బోనాలతో రానున్న భక్తులు**

గట్టు మైసమ్మకు బోనాలను సమర్పించేందుకు గాను పట్టణ పరిధిలోని భక్తులు కాలనీలవారీగా తరలి రానున్నారు. ఆయా కాలనీల మహిళలు తమ తమ ఇళ్ల నుంచి బోనాలను నెత్తిన పెట్టుకొని సంబంధిత కాలనీ పరిధిలోని ప్రధాన కూడలీ వద్దకు చేరుకోనున్నారు. అక్కడ అందరూ కలిసిన అనంతరం భాజ భజంత్రీలు, పోతు రాజుల విన్యాసాల మధ్య శోభయాత్రగా మైసమ్మ క్షేత్రానికి తరలి వస్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు.

● **భారీ పోలీసు బందోబస్తు**

సమస్యాత్మక ప్రాంతంగా పేరొందిన భైంసా పట్టణంలో ఆదివారం నిర్వహించి బోనాల జాతరకు పోలీసు శాఖ భారీ బందోబస్తు వ్యవస్థను ఏ ర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పట్టణ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్ నేతృత్వంలో సమితి శ్రేణులు పోలీసు అధికారుల ను కలిసి బోనాల జాతరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చే శారు. ఇందుకు అనుగుణంగానే భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సారధ్యంలో టౌన్ సీఐ గోపినాథ్ భద్రతా చర్యలకు ఉపక్రమించారు. శోభయాత్ర కొనసాగే మార్గాలన్నింటిలోనూ బందోబస్తు చర్యలు చేపట్టనున్నామని టౌన్ సీఐ గోపినాథ్ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 20 జూలై 2025





● రిమ్స్ ఆసుపత్రిలో ఓపీ వద్ద బారులు తీరిన జ్వరబాధితులు (ఫైల్)

వణుకు పుట్టిస్తున్న.. డెంగీ!

- జిల్లాలో 22కు చేరిన డెంగీ పాజిటివ్ కేసులు
- మొదలైన ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ దందా
- ర్యాపిడ్ టెస్టులతో వ్యాధిని నిర్ధారిస్తున్న అధికారులు
- దోమల బెడదతో కంటి మీద కునుకు కరువు
- అప్రమత్తం కాని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

ఆదిలాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభంతో జిల్లాలో మళ్లీ డెంగీ భయం మొదలయ్యింది. గత కొద్ది రోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో డెంగీ ఉధృతి మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతియేటా జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లోనే డెంగీ వ్యాప్తి అధికంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 22 డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అనాధికారికంగా డెంగ్యూ బాధితుల సంఖ్య అధికంగానే ఉంటుందని తెలుస్తుంది. గడిచిన పక్షం రోజుల్లోనే ఆరు పాజిటివ్ కేసులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కట్టడి చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్న కేసుల సంఖ్య భారీగా పెరిగిపోవడం ఆందోళన రేపుతుంది. వానకాల సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డయేరియా లాంటి వ్యాధుల వ్యాప్తి సర్వసాధారణమే అయినా.. ఏ చిన్నపాటి జ్వరం, ఒళ్లు నొప్పులు వచ్చిన డెంగీ జ్వరమేమోనని భయపడుతున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు సొంతంగానే ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకుని రక్త పరీక్షలు నిర్వహిస్తూ డెంగీ జ్వరమంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయి తే వైద్య ఆరోగ్య శాఖ ఇంకా అప్రమత్తమైనట్లు కనిపించడం లేదంటున్నారు.

దేనికైనా డెంగీ ట్రీట్‌మెంట్

జ్వరం వచ్చిందని ఆసుపత్రికి వెళ్తే ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయంటూ బాధితులు వాపోతున్నారు. మ్యాక్ ఎలిసా టెస్టులు చేయకుండానే డెంగీ వ్యాధి అంటూ ఆసుపత్రుల్లో అడ్మిట్ చేసుకుంటూ చికిత్సలు చేస్తున్నారు. జిల్లాలో రిమ్స్ ఆసుపత్రిలో తప్ప మరెక్కడ డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవకాశం లేదు. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా చికిత్సలు చేస్తూ బాధితులను నిలువుదోపిడి చేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. రక్త పరీక్షలు మొదలుకొని మందులు, బెడ్‌చార్జీలు, ఇతర ఖర్చుల పేరిట అదనంగా దండుకుంటున్నారు. ఏ జ్వరం వచ్చిన డెంగ్యూ ట్రీట్‌మెంట్ చేయడం పరిపాటిగానే మారుతుంది. ప్రైవేట్ ఆసుపత్రులు అందిస్తున్న చికిత్సల పై వైద్యఆరోగ్య శాఖకు డెయిలీ రిపోర్టు ఇవ్వాల్సి ఉన్నా.. కొన్ని ఆసుపత్రులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిసింది. గుట్టుచప్పుడుకాకుండా వైద్యాన్ని అందిస్తూ అడ్డగోలుగా బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల అడ్డగోలు దందాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందంటున్నారు.





డ్రైడేలో భాగంగా వర్షపు నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

ఎలిసా టెస్టుతోనే డెంగీ నిర్ధారణ చేయాలి

: రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్



ఏలిసా టెస్టు అనంతరమే డెంగీ నిర్ధాణ అయినట్లు గుర్తించాలి. ర్యాపిడ్ టెస్టుల ద్వారా వ్యాధిని నిర్ధారణ చేసి వైద్యం చేయడం సరైన పద్ధతి కాదు. ప్రైవేట్ ఆసుపత్రులు డెంగ్యూ వైద్యానికి సంబంధించిన డేలీ రిపోర్టును ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. వారానికి రెండు సార్లు డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తూ ప్రజల్లో డెంగ్యూ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్నాం.

మ్యాక్ ఎలిసా టెస్టు తప్పనిసరి

కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ర్యాపిడ్ టెస్టుల ద్వారానే డెంగీ వ్యాధిని నిర్ధారణ చేస్తున్నాయి. దీంతో బాధితులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. మ్యాక్ ఎలిసా టెస్టు ద్వారానే డెంగీ వ్యాధిని నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు ఇవేమీ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. అనుమానితుల రక్త నమునాలను రిమ్స్ ఆసుపత్రికి పంపిస్తే ఉచితంగానే వ్యాధి నిర్ధారణ చేసి వైద్య ఆరోగ్య శాఖ సంబంధిత ఆసుపత్రికి పూర్తి సమాచారం అందిస్తుంది. కానీ దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు ఎలాంటి లాభం ఉండదని భావించి.. సొంత ల్యాబ్‌ల్లోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తూ చికిత్సను అందిస్తున్నారు. అత్యవసర సమయంలో ర్యాపిడ్ టెస్టులను చేసినా.. తప్పని సరిగా

(తరువాయి 6వ పేజీలో...)



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

స్వచ్ఛ సర్వేక్షన్‌లో బల్దియా వెనకడుగు

● పట్టణం పోటీ చేసిన కేటగిరిలో రాష్ట్రస్థాయిలో చివరి స్థానం ● పురపాలకం పనితీరు మార్చుకోవాలని స్పష్టం చేస్తున్న గణాంకాలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఏడాదికి ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలో ఆదిలాబాద్ పట్టణం వెనుకంజ వేసింది. ఇటీవల కేంద్రం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో నలభైవ స్థానానికి, జాతీయ స్థాయిలో 275వ స్థానంలో నిలిచింది. గతేడాది జాతీయ స్థాయిలో 151 వ ర్యాంకు సాధించగా.. ప్రస్తుతం ర్యాంకు పడిపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. రాష్ట్ర స్థాయిలో అయితే గతేడాది సాధించిన తొమ్మిదో స్థానం నుంచి ఈ ఏడు చిట్టచివరి స్థానానికి పరిమితి కావడం గమనార్హం. ఈ ఏడు యాభై వేల నుంచి మూడు లక్షల జనాభా కేటగిరి లో పట్టణం పోటీ పడగా... అందులో నలభై పట్టణాలు ఉంటే నలభైవ స్థానానికి పరిమితి అయింది. పురపాలక సంఘం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందం సర్వే చేసి నివేదిక అందిస్తారు. దాని ఆధారంగానే స్కోరు కేటాయించి ర్యాంకు ప్రకటిస్తారు. 12,500 మార్కులకు ఆదిలాబాద్ పట్టణం 7,680 వ ర్యాంకును మాత్రమే సాధించడంతో పూర్తిగా వెనకబడింది. నీటి వనరుల వద్ద శుభ్రత, ప్రజా మరుగుదొడ్ల పరిస్థితి అంశాల్లో గతంలో వంద మార్కులు సాధిస్తే ఈ ఏడు సున్నాకే పరిమితమయింది. మార్కెట్ ప్రాంతంలో స్వచ్ఛతకు వంద మార్కులు పడగా... డంప్ యార్డుల్లో బయో మైనింగ్, నివాస స్థలాల్లో స్వచ్ఛత, వ్యర్థాలను వేరుచేయుట వంటి అంశాల్లో పూర్తిగా వెనకబడిపోయింది. పుర యంత్రాంగం ఇప్పటికైనా మేలుకుని పనితీరును మెరుగు పరుచుకోవాల్సిన అవసరముందన్న విషయాన్ని తాజా ర్యాంకులు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి :పీవో

ఉట్నూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల డీటీడీఓలు, ఏటీడీఓలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. శనివారం కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఓరియంటేషన్ ట్రైనింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు, విద్యార్థినులకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అలాగే ఇప్పపువ్వు లడ్డు, విటమిన్ సి పాలిక్ యాసిడ్ వంటి టాబ్లెట్‌లను వారంలో రెండు సార్లు మధ్యాహ్న భోజనం తర్వాత ఇవ్వాలని పలు సూచనలు చేశారు. డీడీ అంబాజీ, డీటీడీఓలు రమాదేవి, జనార్థన్, ఏడీఎంహెచ్ఓ డాక్టర్ కుడిమెత మనోహర్, ఉమ్మడి జిల్లాల ఏటీడీఓలు, జీసీడీఓలు, వార్డెన్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ పర్యటన

ఇంద్రవెల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూర్ (బి), కేస్లాపూర్(జీ), నవగూడ గ్రామాల్లో శనివారం ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన చెక్ డ్యాంలను పరిశీలించారు. చెక్ డ్యామ్ నిర్మాణ పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్ వెంట డీఆర్డీవో అదనపు పీడీ కుటుంబరావు, ఎంపీడీవో బాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు జైస్వాల్ సంతోష్ లాల్, బోడికే దళితానంద్, జాదవ్ విఠల్, తదితరులు ఉన్నారు.

'పూర్తి ఖర్చులను ప్రభుత్వమే భరించాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులలో వెళ్లినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్స అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 45 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, కృష్ణ యాదవ్, శ్రీనివాస్, జోగు రవి, దయాకర్, అశోక్ రెడ్డి, రాకేష్, మహేందర్ పాల్గొన్నారు.

'మైక్రో ఫైనాన్స్‌తో సంబంధం లేదు'

ఆదిలాబాద్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిరుద్యోగులను మోసం చేసిన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ఇటీవల తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ పరిమాణాల దృష్ట్యా నిజాలు తెలపాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ మైక్రో ఫైనాన్స్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ రాజకీయ లబ్ధి కోసమే అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

నేరడిగొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గల హనుమాన్ మందిర షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, యువ నాయకులు సాబ్లే సంతోష్, రాథోడ్ సురేందర్, గులాబ్, భూమయ్య తదితరులు ఉన్నారు.

'బీసీ బంధును కొనసాగించాలి '

బోథ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కొనసాగించిన బీసీ బంధు పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిచెల్మ ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఈ పథకం కొనసాగించడం వల్ల ఎంతో మంది విశ్వకర్మలకు లాభం చేకూరిందన్నారు. ఆయన మరికొంతమంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని, వారికి బీసీ బంధును కొనసాగించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ విషయంలో పాలక ప్రభుత్వం, నాయకులు పునరాలోచించాలని కోరారు.

22న కస్తూర్బాలో ధ్రువపత్రాల పరిశీలన

బోథ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 కస్తూర్బా పాఠశాలలో మిగిలిపోయిన ఇంటర్ మీడియట్‌తో పాటు ఉన్నత పాఠశాల తరగతులలో సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పలిత పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

కోర్టు కేసుల్లో గుమాస్తాల పాత్ర కీలకం

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల్లో న్యాయవాదుల గుమాస్తాల పాత్ర ఎంతో కీలకమని, ఈ ఫైలింగ్ సమయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు సూచించారు. శనివారం కోర్ట్ ప్రాంగణంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల న్యాయవాదుల గుమాస్తాలకు ఈ ఫైలింగ్ గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షకులు ప్రొజెక్టర్ ద్వార ఈ ఫైలింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... ఈ ఫైలింగ్‌లో పైలట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక అయ్యిందని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్ పాల్గొన్నారు.

నేడు సిడాం శంభు వర్ధంతి

ఉట్నూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు అటవి హక్కులు ఇవ్వాలని ఉద్యమాలను నడిపిన గిరిజన పోరాట వీరుడు సిడాం శంబు వర్ధంతి ఆదివారం నిర్వహిస్తున్నారు. మండలంలోని మత్తడిగూడలో నిర్వహించనున్న 7వ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌తో పాటు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, అభిమానులు హాజరు కానున్నారు. తొలితరం ఆదివాసీ గిరిజనుల ఉద్యమ నేత శంభు పోరాటాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవి హక్కుల చట్టం 2006ను అమలులోకి తెచ్చి పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు వేలాది ఎకరాలలో అందించారు. కాగా, శంభు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

'స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ నేత అల్లాపూర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల కార్యశాలలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రాంత వాసులకు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అభివృద్ధి మంత్రాన్ని ప్రజలకు వివరిస్తామని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తామని స్పష్టం చేశారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

'వంతెన నిర్మాణం చేపట్టాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తాంసి మండలం పొన్నారి గ్రామానికి వెళ్లే దారిలో వంతెన నిర్మాణం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వంతెన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఏళ్లుగా బ్రిడ్జ్ సమస్య తీరకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామస్థులు గంగన్న, రవికిరణ్, నగేష్, పోశెట్టి, అడెల్లు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

● మావల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

మావల, జూలై 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ పూర్తి సంసిద్ధంగా ఉండాలని, పట్టణంతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న వార్డుల, గ్రామాలకు కేటాయించిన విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మావల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సమాచారం అయినా ముందుగా విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు అందే విధంగా సమాచార వ్యవస్థను నిర్మించుకోవాలని సూచించారు. ప్రతీఒక్క పోలీసుకు క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్క పోలీసుకు శుభ్రమైన యూనిఫామ్, నీట్ సేవింగ్ అందాన్ని తీసుకొస్తాయని వాటిని కచ్చితంగా పాటించాలని సూచించారు. స్టేషన్‌లో ఉన్న పాత వాహనాలపై తగు చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సిబ్బందిని కేటాయించి సత్వర న్యాయం అందించే విధంగా ప్రజలలో పోలీసు పట్ల నమ్మకాన్ని పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సిఐ ఫణిధర్, మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు ఎల్. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి, యూనుస్, ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మావల పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

● సరైన పత్రాలు లేకుండా మొబైల్ ఫోన్‌లను ఖరీదు చేస్తే కేసు

ఆదిలాబాద్ టౌన్: మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో ఇటీవల మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న 109 మందికి తిరిగి వారి ఫోన్‌లను అందించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ పాల్గొని బాధితులకు ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను తిరిగి సంపాదించడం కోసం ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. 20 రోజుల వ్యవధిలో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి బాధితులు పోగొట్టుకున్న, దొంగలించబడిన 109 మొబైల్ ఫోన్‌లను తిరిగి రాబట్టినట్లు పేర్కొన్నారు. ఇకపై సెల్‌ఫోన్‌కు సంబంధించిన పత్రాలు, బాక్సులు లేకుండా దుకాణాదారులు వాటిని ఖరీదు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 900 మొబైల్ ఫోన్‌లను బాధితులకు తిరిగి అందించామని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీ.ఎస్పీ జీవన్ రెడ్డి, ఏఆర్ డీ.ఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, ప్రత్యేక బృందం సభ్యులు గోపి కృష్ణ, సంజీవ్, రియాజ్, మజీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

● నార్నూర్ వైద్య సిబ్బందికి మెమో జారీ చేసిన జిల్లా వైద్యాధికారి

నార్నూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): శనివారం జిల్లా వైద్యాధికారి నరేంద్ర రాథోడ్ నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిని అకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ సిబ్బంది వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీ షియన్ ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కాకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. వీహెచ్ ఎస్ఎన్‌డీ సమావేశంలో స్వయం సహాయక సంఘాలు, గ్రామ పటేల్, గ్రామ పెద్దలు, అన్ని కుల సంఘాల నాయకులు కార్యక్రమంలో భాగంగా అందర్నీ భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి ఎదుట ఉన్న ఆరో ప్లాంట్‌ను పరిశీలించి అధికారులు పలు సలహా సూచనలు ఇచ్చారు. నీటిని రోగులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పాత వీహెచ్‌సీ భవనాన్ని సందర్శించి టెలీ మెడిసిన్ కేంద్రంగా మారుస్తూ తక్షణ మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశించారు. తనిఖీలు సేవలు పారదర్శకత బాధ్యత నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహించబడ్డాయని అన్నారు. వెంట సిబ్బంది ఉన్నారు.

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు ముందు జాగ్రత్తగా రక్త నమూనాలను సేకరించి ఆర్డిటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, తదితరులున్నారు.

నేరడిగొండ: గ్రామాల్లో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్ వైజర్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని తేజాపూర్, కుమారీ గ్రామాలలో రాపిడ్ ఫీవర్ సర్వే వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.



ఇంద్రవెలిలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ రాథోడ్ నరేందర్

వారం రోజుల తర్వాత కురిసిన వర్షం

● అత్యధికంగా బేలలో 74.0 మి.మీ.ల వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి)/బోథ్: గత వారం రోజుల తర్వాత ఆదిలాబాద్ జిల్లాలో వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జిల్లా సగటు వర్షపాతం 10.3 మి.మీలు కాగా 5.9 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బేల మండలంలో 74.0 మి.మీల వర్షం కురవగా ఇచ్చోడలో 17.9, సిరికొండలో 15.1, నేరడిగొండ 5.6, గుడిహత్నూర్ 6.4 మి.మీల వర్షాపాతం నమోదైంది. ఈ యేడు జూన్ 1 నుంచి జూలై 19 వరకు జిల్లాలో 398.4 మి.మీల వర్షం కురవాల్సి ఉండగా 393.5 మి.మీల వర్షం కురిసింది. నేరడిగొండ, గాదిగూడ, సోనాల మండలాలు మినహా అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. బోథ్, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్ మండలాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. పొచ్చెర, కుంటాల జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి.కురిసిన వర్షం పత్తి, సోయా, కంది పంటలకు మేలు చేసిందని అన్నదాతలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న పొచ్చెర జలపాతం



ఇచ్చోడ మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు